ఆలయ అభివృద్ధికి విరాళం



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ మోహన్‌రావు కాలనీలోని అభయాంజనేయ స్వామి దేవాలయం అభివృద్ధికి రాజుయాదవ్ బుధవారం ఆలయ కమిటీసభ్యులకు రూ.40 వేలు విరాళంగా అందజేశారు. అధ్యక్షులు సార్ల రమేష్, ఉపాధ్యక్షులు జనగామ స్వామిగౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణచారి, గౌరవ అధ్యక్షులు రాజుయాదవ్, ఎల్లయ్య, బ్రహ్మం, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్లకు సత్కారం



సత్కరిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, కావేరి

ఘట్‌కేసర్: జాతీయ జూనియర్ అండర్‌-20 ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన ఏదులాబాద్‌కు చెందిన ప్రణతి లాలిత్యను మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డితో కలిసి బుధవారం శాలువాతో సత్కరించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన 23వ జాతీయ జూనియర్ అండర్‌-20 ఫెడరేషన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల 100 మీటర్ హర్డ్స్ జూనియర్ విభాగంలో ఆమె 14.42 సెకన్లలో పరుగెత్తి బంగారు పతకం సాధించింది. మల్లేష్, మురళి, వెంకటేష్ పాల్గొన్నారు.

తూంకుంట మున్సిపల్ కమిషనర్‌గా ఎంఎన్ఆర్. జ్యోతి



శామీర్‌పేట్: తూంకుంట మున్సిపల్ కమిషనర్‌గా ఎంఎన్ఆర్.జ్యోతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు విధులు నిర్వహించిన వెంకటగోపాల్ బదిలీపై వెళ్లిపోయారు. కమిషనర్‌కు మున్సిపల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, డీఈ సునీత శుభాకాంక్షలు తెలిపారు.

రివార్డులు.. అభినందన



మేడ్చల్ జోన్ పోలీసులను అభినంధిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్‌మహంతి

మేడ్చల్: విధి నిర్వహణలో కేసుల ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మేడ్చల్ డివిజన్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీసు అధికారులను సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి అభినందించి రివార్డులు అందజేశారు. సైబరాబాద్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన డివిజన్ పోలీసులను అభినందించారు. మేడ్చల్, పేట్ బషీరాబాద్, దుండిగల్ పీఎస్‌లకు చెందిన ఇన్‌స్పెక్టర్, డీఐ సిబ్బందిని ఆయన అభినందించి రూ.5 వేల రివార్డులను అందజేశారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శంకర్‌రెడ్డి తదితరులున్నారు.

'బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి'

మేడిపల్లి: మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా గెలుపొందిన సర్దార్ పుటం పురుషోత్తంరావు పటేల్ కార్యవర్గం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను పీర్జాదిగూడలో మర్యాద పూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ.. మున్నూరు కాపులు ఏకమవుతూ.. తమతో పాటు బీసీలను కలుపుకొని రాజ్యాధికారం వైపు పయనించాలని కోరారు. తనవంతుగా ఎల్లప్పుడూ సంఘానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పెద్ది పెంటయ్య, కంచి సత్యనారాయణ, బుక్క వేణుగోపాల్, కాశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

7న దండోరా జెండాను ఎగురవేద్దాం

మల్కాజిగిరి: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 7న వాడవాడలా దండోరా జెండా ఎగురవేద్దామని జాతీయ నాయకుడు లక్ష్మణ్‌మాదిగ పిలుపునిచ్చారు. మల్కాజిగిరిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. 30 ఏళ్ల పోరాటాన్ని గుర్తు చేస్తూ.. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. మందకృష్ణమాదిగ సాధించిన ప్రజా పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. అనుబంధ సంఘాల నాయకులు కేశపాక రాంచందర్, మనోహర్, శివ, వినయ్, పాల్గొన్నారు.

'మొక్క'వోని దీక్ష!



- వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు ప్రత్యేక కార్యాచరణ
- 2025-26లో 70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయం

సాక్షి,సిటీబ్యూరో: మళ్లీ 'మొక్క'వోని దీక్షతో వనమహోత్సవానికి కార్యాచరణ ప్రణాళికతో జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. వర్షాలు ప్రారంభంకావడంతో ఈనెల రెండోవారం నుంచి వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు పురపాలక సంఘాలు, మున్సిపల్ సర్కిళ్లు, ప్రభుత్వ శాఖల వారీగా లక్ష్యాలను ఖరారు చేసిన అధికారులు.. స్వచ్ఛంద సంస్థలను కూడా భాగస్వాములను చేసేందుకు చర్యలు తీసుకుంటుంది.

ప్రకృతి సమతుల్యత...

సమృద్ధిగా వర్షాలు కురవాలంటే సాధారణంగా అటవీ విస్తీర్ణం కనీసం 33 శాతం ఉండాలని అటవీశాఖ పేర్కొంటున్నప్పటికీ, నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో మాత్రం పరిస్థితి విరుద్ధంగా ఉంది. పట్టణీకరణతో కాంక్రీట్ జంగల్‌గా మారుతున్న శివారు పురపాలికల్లో ఆ లోటును అధిగమించేందుకు పుర యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవానికి శ్రీకారం చుడుతోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా మొక్కలను నాటాలని నిర్ణయించింది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను అధికార యంత్రాంగం ఖరారు చేయడంతో అందుకు అనుగుణంగా ఆయా శాఖలు కార్యాచరణతో ముందుకు సాగుతున్నాయి.

6 మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యాచరణ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఈ ఏడాదిలో 70 లక్షల మొక్కలు నాటాలని నిర్ణయించారు. శివారు 16 పురపాలక సంఘాల్లో వనమహోత్సవంలో భాగంగా బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు మేడ్చల్, తూంకుంట, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, ఎంసీపల్లి, అలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీలతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని 6 మున్సిపల్ సర్కిళ్లలో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

10 శాతం ఔషధ, పండ్ల మొక్కలు

వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలతో పాటు ఈత మొక్కలను తప్పనిసరిగా 10 శాతం నాటేలా చర్యలు తీసుకుంటున్నారు. మొక్కలను నాటడమే కాకుండా వాటికి రోజూ నీళ్లు అందించడం, ఎరువు తదితర సంరక్షణ కార్యాచరణ సిద్ధం చేశారు. మొక్కలు నాటిన స్థలాలను జియో ట్యాగింగ్ ద్వారా టీజీఎఫ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో ప్రతిరోజూ నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలు

జిల్లాలో అటవీశాఖ అధ్వర్యంలో తూంకుంట, కండ్లకోయ, దూలపల్లిలోని 3 నర్సరీలు, 16 పురపాలక సంఘాలలోని నర్సరీల్లో లక్ష్యానికి తగినట్లుగా మొక్కలు పెంచుతున్నారు. ఈసారి వనమహోత్సవంలో గతేడాది నాటిన మొక్కలతో పాటు టేకు, ఈత, వెదురు, మలబార్, ఇప్ప, మద్ది, వెలగ, మర్రి, వేప, రేల, బాదాం, రావి, చింత, తులసి, నిమ్మ, జామ, సీతాఫలం, ఖర్జూర, మందార, సన్న జాజి, మల్లె నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పచ్చదనం.. భూ పరిరక్షణ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పచ్చదనాన్ని పెంచడంతో పాటు కబ్జాకు గురౌతున్న ప్రభుత్వ, అసైన్డ్, అటవీ, చెరువు శిఖం భూముల పరిరక్షణే లక్ష్యంగా వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అర్బన్ పార్కులతో సహా పల్లె , పట్టణ ప్రాంతాల్లో ప్రకృతి వనాల లక్ష్యంగా వనమహోత్సవం విజయవంతం చేసేందుకు ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. రహదారుల పక్కన, విద్యా సంస్థలు, చెరువుగట్లు, ప్రైవేటు రంగ సంస్థల కార్యాలయాల్లో వెంచర్లు, లే అవుట్లు, శ్మశానవాటికల్లో మొక్కలను విరివిగా నాటాల్సి ఉంది.



అధికారులు సమన్వయంతో పనిచేయాలి

సాక్షి సిటీబ్యూరో: వనమహోత్సవంలో పండ్లు, ఔషధ మొక్కలను కూడా ఎక్కువగా నాటేలా చూడాలని మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామీణాభివృద్ధి, అటవీ, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వనమహోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలం ముందుగానే మొదలైనందున ఈసారి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా ముందుగానే అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాల న్నారు.

సార్వత్రిక సమ్మె నోటీసుల అందజేత

మేడ్చల్: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ.. ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె నోటీసులను మండల సీఐటీయూ నాయకుల కంపెనీల యాజమాన్య ప్రతినిధులకు అందజేశారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీల పరిధిలోని కంపెనీల వద్దకు వెళ్లి కంపెనీల యాజమాన్య ప్రతినిధులను కలిసి సమ్మె నోటీసులు అందజేశారు. సీఐటీయూ నాయకులు నరేష్, వెంకటేష్, నర్సింగ్‌రావు, దేవేందర్, మల్లేష్, భాగ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశావర్కర్లు

కీసర: జూలై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో ఆశావర్కర్లు పాల్గొననున్నట్లు బుధవారం కీసర ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు సీహెచ్. జయప్రద, రాధా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా జూలై 9న సమ్మె నిర్వహిస్తున్నామని, ఈ సమ్మెకు ఆశావర్కర్లు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మేడ్చల్: ప్రజలకు మరింత చేరువకావడానికి కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సీనియర్ నాయకుడు మున్సిపల్ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే హాజరవుతన్న ×జై బాపు, జై సంవిధాన్‌× కార్యక్రమంలో ఉమ్మడి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు తప్పకుండా హాజరుకావాలని కోరారు. నాయకులు రమేష్, రాజు, మల్లేష్‌గౌడ్, మధుకర్‌యాదవ్, దేవ, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



అ'పూర్వ' కలయిక

కీసర: కీసర ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదివిన 1997-1998 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా కలిసి తమ విద్యార్థి దశలో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి రూ.72 వేలు ఆర్థికసాయం అందజేశారు.

గృహహింస చట్టం మహిళలకు రక్షణ వలయం

ఉప్పల్: గృహహింస చట్టం మహిళలకు రక్షణ వలయమని ఉప్పల్ మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జ్ ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి అన్నారు. సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో గృహహింస నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ చట్టం మహిళలకు రక్షణ వలయంగా ఉందని, దీనిపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలియని వారికి స్పష్టంగా వివరించాలని, ఇళ్లలో ఇబ్బందులు పడుతున్న మహిళలను గుర్తించి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంట్లో మహిళలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, చాలామంది పరువు కోసం తమ ఇబ్బందులు చెప్పుకోలేకపోతున్నారన్నారు. కో- ఆర్డినేటర్ వైదేహి మాట్లాడారు. జాగృతి పోలీస్ కళా బృందం గృహహింసపై పాటల రూపంలో వివరించారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రామలింగారెడ్డి

ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన

ఘట్‌కేసర్: పెండింగ్‌లో ఉన్న నాలుగేళ్ల ఫీజు మొత్తం చెల్లిస్తేనే పరీక్ష ఫీజు తీసుకుంటామని ఎస్వీ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో కళాశాల గేటు నిరసన చేపట్టారు. గత 4 రోజులుగా కళాశాల యాజమాన్యానికి విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోకపోవడంతోనే ధర్నా చేశామన్నారు.

పారిశ్రామిక భద్రతా చట్టాలను బలోపేతం చేయాలి



షేక్ షావలి

జవహర్‌నగర్: రాష్ట్రంలో సిగాచి ఘటనలు జరగకుండా పారిశ్రామిక భద్రతా చట్టాలను తీసుకురావాలని ఐఎఫ్‌టీయూ జాతీయ కన్వీనర్ షేక్‌షావలి ఓ ప్రకటన ద్వారా తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రదేశాల్లో మెరుగైన సౌకర్యాలు, రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిగాచి కంపెనీలో ప్రమాదం జరిగి మూడ్రోజులైనా ప్రమాద తీవ్రత, నష్టాన్ని అంచనా వేయలేకపోవడం సిగ్గు చేటన్నారు. రెస్క్యూ టీమ్, రెవెన్యూ యంత్రాంగం మధ్య సమన్వయం లోపించి మరణాలపై స్పష్టమైన సమాచారం లేదని దుయ్యబట్టారు. మృతుల కుటుంబాలకు రూ.3 కోట్లు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. కోటి, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఫామ్‌హౌస్‌పై ఎస్‌ఓటీ దాడులు: 20 మంది అరెస్ట్

శామీర్‌పేట్: శామీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఫామ్‌హౌస్‌లో పేకాట ఆడుతున్న జూదరులను ఎస్‌ఓటీ పోలీసులు మెరుపు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. 20 మందిని అరెస్టు చేసి..వారి వద్ద రూ.లక్షా 83 వేల నగదు, కార్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శామీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం..బొమ్మరాసిపేట్ గ్రామంలో ఏ అండ్ ఏ స్కై రిసార్ట్ ఫామ్‌లో మద్యం సేవిస్తూ పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. జూదరులను అరెస్టు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో బుధవారం కమిషనర్ వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వ్యర్థాలు, డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్నం భోజన వసతులు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. బోనాల పండుగ సందర్భంగా అమ్మవారి దేవాలయాలను సందర్శించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభు, ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు, స్నేహ సంఘాల మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరు జల్లులకే చిత్తడి!

మేడ్చల్: రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలోని రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఎల్లంపేట్ మున్సిపాలిటీలో గ్రామాలు అధికంగా ఉండటంతో రోడ్లు బురదమయంగా మారాయి. ప్రధానంగా మేడ్చల్ పట్టణంలో కాలనీలలోని అంతర్గత రోడ్లపై వరద నీరు నిల్వ ఉండి, రోడ్లపై చిన్న కుంటలను తలపిస్తున్నాయి. ప్రధానంగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, పాత మేడ్చల్, వినాయక్‌నగర్ కాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీ, ఉమానగర్, బాలాజీనగర్, రాఘవేంద్రనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా రోడ్లపైనే వరదనీరు దర్శనమిస్తోంది.

కనిపించని 100 రోజుల ప్రణాళిక..

పట్టణాల్లో వర్షాకాలంలో రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టేందుకు 100 రోజుల ప్రణాళిక అమలులో వర్షం అంశం చేర్చినా.. అధికారులు రోడ్లపై వర్షం నీరు నిల్వ ఉండకుండా పటిష్టమైన చర్యలు చేపట్టకపోవడంతో ఎక్కడా చూసినా చిరు జల్లులకే నీరు నిల్వ ఉంటున్నాయి. వారం రోజులకు పైగా వర్షపు నీరు రోడ్లపై నిల్వ ఉండటంతో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి రోగాల భారినపడే ప్రమాదం ఉంది. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



ఆర్టీసీ కాలనీలో రోడ్లపై నిలిచిన వరద నీరు

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

సీడీపీఓ స్వాతి

పోచారం: మానవ అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు అయినప్పుడే దీనిని సమూలంగా అడ్డుకట్టవేయవచ్చని అల్వాల్ సీపీడీఓ స్వాతి అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా మహిళా శిశుసంక్షేమశాఖ అల్వాల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అన్నోజిగూడలోని ఎల్ఎస్‌కాలనీ ఫంక్షన్‌హాల్‌లో రెండ్రోజుల పాటు నిర్వహించిన శిక్షణా శిబిరంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణ అనేది ప్రపంచవ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తూ ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తున్న నేరపూరితమైన చర్యగా పేర్కొన్నారు. దీనికి పేద, మధ్యతరగతి అమ్మాయిలు, మహిళలు ఎక్కువగా గురౌతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజ్వల సీనియర్ కో- ఆర్డినేటర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే, మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చన్నారు. ప్రతిరోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు అక్రమ రవాణా బారిన పడుతున్నారని చెప్పారు. ప్రేమ, పెళ్లి, ఉద్యోగాలు, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురౌతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సూపర్‌వైజర్లు సత్యమ్మ, మణెమ్మ, ప్రజ్వల అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ అంబర్‌సింగ్, మితాళిరాజ్, భూపాల్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీడీఓ స్వాతి

రూ. 1.30 కోట్లతో అభివృద్ధి పనులు

రామంతాపూర్ : డివిజన్ పరిధిలోని ఏడీఆర్ఎం ఆసుపత్రి నుంచి ఓల్డ్ రామంతాపూర్ గ్రేసెస్ స్కూల్ వరకు రూ.1.30 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శ్రీవాణివెంకట్‌రావుతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో పెండింగ్ పనులను పూర్తి చేయడానికి ప్రాధాన్యతనిస్తున్నామని, మిగతా అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామన్నారు. కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ.. డివిజన్‌లో దాదాపు 80 శాతం అభివృద్ధి పనులను పూర్తిచేశామని, మిగతా పెండింగ్ పనులు పూర్తిచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రగతినగర్ సమస్యలు పరిష్కరిస్తా..

డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం కార్పొరేటర్ శ్రీవాణి, జీహెచ్ఎంసీ డిప్యూటీ ఇంజినీర్ నాగమణి, జలమండలి మేనేజర్ రవీందర్‌తో కలిసి ప్రగతినగర్‌లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రగతినగర్‌లో ఉన్న ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ, రోడ్డు వరద నీటి కాల్వ మరమ్మతులు తదితర పనులను త్వరలోనే ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. వెంకట్‌రెడ్డి, కృష్ణమూర్తి, బుచ్చిరెడ్డి, జగదీష్‌రెడ్డి, మురళీధర్, ప్రవీణ్‌గౌడ్, శివప్రసాద్, ప్రభాకర్, వెంకట్‌రావు, రాజగోపాల్, సత్యం, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చెరువు కట్టను ఆక్రమించారని ఫిర్యాదు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కాంగ్రెస్ నేతలు

బోడుప్పల్: చెంగిచర్లలోని చింతల చెరువు కట్టను ఆక్రమించుకుని నిర్మించిన బహుళ అంతస్తులను తొలగించాలని కోరుతూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను బుధవారం బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, మేడ్చల్ నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ వార్డు సభ్యులు కుర్రి శివశంకర్, మాజీ కో - ఆప్షన్ సభ్యులు రంగబ్రహ్మన్నగౌడ్ కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని అపార్ట్‌మెంట్లు నిర్మించారని, వాటిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

సమ్మె నోటీసుల అందజేత



సమ్మె నోటీసును అందజేస్తున్న ఆశావర్కర్లు



సమ్మె నోటీసు అందజేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

మల్లాపూర్: జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని మల్లాపూర్ యూపీఎస్సీ పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్లు మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసులు అందజేశారు. ఆశావర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకురాలు లత మాట్లాడుతూ.. శతాబ్దాలుగా కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మికచట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం, వాటి స్థానంలో 4 లేబర్‌కోడ్‌లు తీసుకురావడం ఆందోళనకరమన్నారు. ఈ కోడ్‌లు అమలైతే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరమవుతుందన్నారు. కార్మికుల ఐక్యత శక్తిని దెబ్బ తీయడం, ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

కాప్రా: 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నేపథ్యంలో తాము విధులకు హాజరు కావడం లేదని కాప్రా సర్కిల్ పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. బుధవారం సమ్మె నోటీసును గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ అధికారులకు యూనియన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ కార్మికులంతా పాల్గొంటున్నారని తెలిపారు. అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. అసోసియేషన్లు పిలుపునిచ్చిన సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నామని వివరించారు. భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కాప్రా సర్కిల్ ప్రెసిడెంట్ కుర్మన్న, ప్రతినిధులు సాయిలు, నరసింహ, రాజు, జాను, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సన్నాహక సమావేశం

ఉప్పల్: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తొలిసారి నగరానికి వస్తున్న సందర్భంగా భారీగా ఏర్పాట్లు చేయాలని బుధవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి హాజరై పలు సూచనలు చేశారు. కో- ఆర్డినేటర్లు గజ్జల కాంతం, శశికళ యాదవ్, మిథున్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీదేవి, రజిత , స్వర్ణరాజ్ శివమణి స్థానిక నేతలు పాల్గొన్నారు.

